
# ఎడిక్షన్... మోర్...!

— శ్రీసుభా



సీతాపతిగారు వాలుకుర్చీలో పడుకుని పైకి చూస్తున్నాడు. అంతమాత్రాన ఆయన తన్మయత్వంలో గానీ, భక్తిభావంలోగానీ మునిగిపోలేదు. పోనీ పైన, ఇంకా పైన ఉండే భగవంతుడి గురించి ఆలోచిస్తున్నాడా అంటే అదీ పొరబాటే అవుతుంది! ఆయన ఆలోచనల్లో తేలి ఆడుతున్నాడనుకోవాలి!

ఆయనలాగే ఆయన సతీమణి మాలతిగారు కూడా సోఫాలో కూర్చుని అదే పని చేస్తోంది. అయితే నిజానికి ఇద్దరూ ఒకేరకంగా ఆలోచించడంలేదు. అవి వేరు వేరు దారుల్లో పోతున్నాయి. సరిగ్గా చెప్పాలంటే ఈమధ్య వాళ్లకో గడ్డు సమస్య ఎదరయింది. అది పది రోజులుగా 'మునగానాం, తేలానాం' అనే దశలో నానుతోంది. అలా ఆలోచనల్లోంచి తేరుకుని మొదట వాస్తవంలోకి వచ్చింది మాలతిగారే!

"ఇది బుర్రలు బద్దలుకొట్టుకోవాల్సినంత పెద్ద సమస్య కాదనిపిస్తోందండీ! మీరు సవ్యంగా ఆలోచించగలిగితే చాలు, అన్నీ దారికి వస్తాయి!"

"అయితే నా ఆలోచనలు అడ్డదారులు పట్టాయంటావా?"

"అది కాదనుకోండి... మన సమస్యను పక్కకు తోసే మనస్పర్థల గురించి ఎంత తక్కువ

మాట్లాడుకుంటే అంత లాభం! మన శ్యామల్ని ఎప్పుడో పెళ్లిచేసి అత్తారింటికి పంపవల్సింది. మనిద్దరిదీ ఒకే మాట కానిమూలంగానో, దేవుడు కనికరించనిమూలంగానో దాని పెళ్లి వెనక్కే వెడుతోంది. కాదంటారా?"

"కాదంటే నువ్వు ఊరుకోవు కదా! నాకు తెలుసు. నువ్వు ముందు వాసుగాడి పెళ్లిచేసి, ఆ కట్నం డబ్బుతో శ్యామలకి పెళ్లిచేసి గట్టెక్కుదామంటావ్. వినడానికి బాగానే ఉంది, మాలతీ! ఇలా అందరిళ్లల్లో పెద్దలు చేస్తూనే ఉన్నారు. కానీ ఇప్పుడు రోజులు మారాయి. అదీ రెండేళ్లుగా... ముక్కువచ్చులారనివాడు కూడా, 'నీ గమ్యం ఎక్కడికి?' అని అడిగితే తడుముకోకుండా వెంటనే 'అమెరికా కాక మరే దేశం!' అనేస్తున్నాడు. అలాంటప్పుడు వాసుగాడు అక్కడికిపోయి 'నాలుగు డాలర్లు' సంపాదించుకుంటానంటే ఎలా వద్దనమంటావ్? 'అక్కడనుంచి వచ్చేదాకా నా పెళ్లిమాట ఎత్తద్దు' అంటూ హెచ్చరికలు చేస్తూంటే ఏమని సమాధానం ఇవ్వమంటావ్?" అన్నాడు లౌక్యంగా సత్యావతి.

"అంతా బాగానే ఉంది గానీ, నే చెప్పేది వినండి. మనవాళ్లల్లో మగపిల్లకాయలందరూ మూటా ముల్లే సర్దుకుని అమెరికా, యూరప్ పరుగెడుతున్నారు. దాంతో ఇక్కడ పెళ్లికొడుకులకు కొరత ఏర్పడే అవకాశం ఉంది. ఇక్కడ ఉంటున్న వాళ్లు కూడా రేట్లు పెంచేస్తున్నారు... వాడు అమెరికా వెళ్లాలి, అక్కడ నిలదొక్కుకుని డాలర్లు పంపాలి. ఇవన్నీ ఎప్పుడు జరిగేనూ?"

"ఏం చేద్దామంటావ్? వాడు అక్కడ ఉండి ఉద్యోగం చేస్తూంటే వాడి రేటు కూడా పెరుగుతుంది. ఈలోపున శ్యామలా కంప్యూటర్స్ చేస్తుంది. అదృష్టం బాగుంటే దాన్నీ అమెరికా పంపిద్దాం... పెళ్లంటావా? కాకపోదు. కొంపలేం మునగవు! ఆలోచించు."

"నా ఆలోచన ఎవరికి పడుతుంది? మీరు వినరు. వాడూ లెక్ఖచేయడూ. ఇక్కడ వాసు చేస్తున్నది చక్కని ఉద్యోగమే కదా? వాడికి పిల్లనిస్తామని ఎంతోమంది వచ్చిపోతున్నారు. ఎప్పుడో ఎక్కువ దొరికే కట్నం కన్నా ఈవేళ వచ్చిన దాంతో సంతృప్తిపడితే బావుంటుంది. నాకు అర్థం అయిందిలెండి! మీకు డబ్బు మీద రోజురోజుకూ మోజు పెరుగుతోంది!" అంది నవ్వుతూ మాలతి.

"పోనీ కొడుకును దగ్గర కూర్చోపెట్టుకుని, వాడికి నచ్చచెప్పు. నేను కాదంటానా?"

"మీరు నోటితో కాదనరు... లైజుగా వాడి బుర్రలో కట్నం రాట్నాన్ని జోరుగా తిప్పుతున్నది మీరే!"

సీతాపతి నవ్వేశాడు. మాలతి నవ్వలేదు! అప్పుడే అటు వచ్చిన శ్యామల తల్లిదండ్రులవైపు ఆశ్చర్యంగా చూసింది.

000

"నేను చెప్పింది అర్థమయిందా, వాణీ! ఇదీ నా పరిస్థితి. నాకేం చెయ్యాలో తోచడంలేదే! అంతా అయోమయంగా ఉంది!" అంది శ్యామల దిగులుగా.

"చెప్తాను గానీ, నువ్వేం అనుకోకూడదు."

"అనుకునేటట్టయితే నీ ముందు ఎందుకు వాపోతానే?"

"అయితే చెప్పు, నువ్వు నిజంగా ప్రేమిస్తున్నది ఎవర్ని? కుమార్‌నా, సుకుమార్‌నా?"

శ్యామల గలగలా నవ్వేసింది. ఆ పైన అంది "నేను ప్రేమించడం కాదే, తల్లీ! వాళ్లిద్దరూ నన్ను ప్రేమిస్తున్నామంటున్నారు. నా వెంటపడుతున్నారు."

"ఇద్దరిలో సౌండ్ పొజిషన్ ఉన్నవాళ్లు ఎవరే?"

"సుకుమార్."

"ఎందుకని?"

"సుకుమార్ మామయ్య రామనాథంగారికి శాన్‌ఫ్రాన్సిస్‌కోలో సాఫ్ట్‌వేర్ కంపెనీ ఉంది. ఆయనగారు ఇతన్ని ప్రోగ్రామర్‌గా ఉద్యోగం ఇస్తాను, రమ్మన్నాట్ట."

"మరి కుమార్ సంగతి?"

"కుమార్ ఇక్కడే ఉద్యోగం చేస్తున్నాడు. జీతం ఫరవాలేదు. కానీ ఇంటి పరిస్థితులనుబట్టి అతను దేశం వదలి వెళ్లలేడు. కానీ మంచి మనిషి."

"అయితే నీ ప్రేమ పురాణం గురించి ఇంట్లో ఎవరికైనా తెలుసా?"

"తెలియదు. అన్నయ్య వాసుకు చెబుదామనుకున్నాను. వాడు ముక్కోపి. నానా గొడవా చేసిపారేస్తాడని ఊరుకున్నాను."


"మరి మీ వాళ్లు నీకు సంబంధాలు చూస్తూ పెళ్లి చేసుకోమని ప్రెషర్ చేస్తే ఏం చేస్తావ్? నోరు వెళ్లబెడతావా?"

"ఆ ఇబ్బందులేం లేవే! ఎందుకంటే వాసు ఈ నెలలో అమెరికా వెడతాడు. వాడు అక్కడ సెటిల్ అయిన తరువాతే నా పెళ్లి!"

"బావుంది."

"బావుంది కాదే, కుమార్ రోజూ నా వెంటపడుతున్నాడు. కట్నం అక్కరలేదుట... నేను గ్రీన్ సిగ్నల్ ఇస్తే తను ఇంట్లో చెబుతానంటున్నాడు. నన్ను మా ఇంట్లో చెప్పమంటున్నాడు."

వాణి కాసేపు ఆలోచించింది. అటుగా వచ్చిన కుర్రవాడి దగ్గర వేరుశెనగకాయలు కొన్నది. కొన్ని శ్యామల చేతిలో పోసి, "తిను!" అంది. ఆపైన శ్యామల మొహంలోకి చూసింది. కాసేపు తల ఊపుతూ, కళ్లజోడు సర్దుకుని, "శ్యామలా! ఇప్పటి రోజులబట్టి నువ్వు సుకుమార్‌కి ప్రిఫరెన్స్ ఇవ్వాల్సి ఉంటుంది సుకుమార్ అమెరికా వెడతాడు కాబట్టి! అతను అక్కడ నీకూ ఓ ఉద్యోగం చూశాడనుకో... సమస్యలన్నీ ఓ కొలిక్కి వస్తాయి. ఈ దేశంలో ఉన్నంతకాలం మన అమ్మాయిలను, అబ్బాయిలను కట్నాల సమస్యలు, కులసమస్యలు పట్టిపీడిస్తూనే



ఉంటాయి."

"అలా అంటావా?"

"అవునే... అమెరికా వెళ్లిపోయావనుకో. అత్తింటివారు ఉండరు. స్వేచ్ఛగా బతకొచ్చు!"

"మరి కుమార్‌ని ఎలా తిరస్కరించమంటావు?"

"ఏముంది? పెళ్లి ఉద్దేశం వాయిదా వేసుకుంటున్నానని చెప్పేయ్. అంతగా ప్రెషర్ చేస్తే ఊరు వెడుతున్నానని చెప్పి కనుమరుగు అవ్వు!"

"పాపం, బాధపడతాడే ... ఎలా చెప్పాలో...."

వాణి పకపకా నవ్వేసింది. "వెర్రి శ్యామలా! ఈ శతాబ్దంలో ఆప్యాయతలనీ, అనురాగాలనీ సెంటిమెంట్లనీ పెట్టుకోకూడదు. నువ్వు కట్టుకునే పట్టు చీర, నీ మెడలో నగలు, నీ ఉద్యోగం, నీ జీతం, ఇవే నీకు శోభనిస్తాయి. నీకు గొప్ప మనసు ఉంటే ఉండవచ్చు. కానీ అది భగవంతుడు నీ శరీరంలో నీ గుండె పక్కన ఓ లాకర్లో పెట్టిన వింత పదార్థం అని మర్చిపోకు ఎప్పుడూ! ఆయనగారు దాని తాళం తనదగ్గరే ఉంచుకుంటాడు గమ్మత్తుగా. నీకు ఇవ్వడు. వెతుక్కోమంటాడు. ఆటలాడిస్తాడు. అందుకే హృదయాన్నీ, మనసునూ పట్టించుకోకూడదు. హాయిగా బతకడం ఎలాగో తెలిసినవాళ్లే సుఖపడతారు. ఇది జీవితమే... మనం ఎప్పుడూ పైకి వెళ్లడానికే ప్రయత్నించాలి ... సుఖాన్నీ సంతోషాన్నీ ఆశించాలి... మర్చిపోకు!"

"అలా అంటావా?"

"ఇది వాణీ శతకమే! బాగా గుర్తుపెట్టుకో... మననం చేసుకో... సరేనా?"

శ్యామల తల ఊపింది. ఇద్దరూ ఇందిరా ప్రియదర్శిని పార్కునుంచి బయటపడ్డారు.

000

వాసుకు శాన్‌ఫ్రాన్సిస్‌కో చాలా నచ్చింది. రామనాథంగారు చూపించిన కమ్యూనిటీ హాస్టల్లో స్థిరపడ్డాడు. ప్రోగ్రామర్‌గా ఉద్యోగం కూడా ఇప్పించాడు. అదీ కంప్యూటర్ మీద అమెరికా వారి 'వై టూ కె' సమస్యల పరిష్కారానికి తను నడుం కట్టడం ఎంతో సంతృప్తి నిచ్చింది. తను పనిచేసే సంస్థ పేరు సాయికృప కన్సల్టింగ్స్ ... అందులో నలుగురైదుగురుదాకా తెలుగువాళ్లే పనిచేస్తున్నారు. పైగా అందులో జీవన ఒకత్తి.... జీవన తనతో కలిసి ఎంసీఏ చేసిన వ్యక్తి. పెద్దగా స్నేహం లేకపోయినా, పరిచయం ఉంది.


వాసు వీక్ ఎండ్‌లో నగరం చూశాడు. సముద్రం చూశాడు. కాలిఫోర్నియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంటిగ్రల్ స్టడీస్‌కు వెళ్లాడు. అక్కడ లోకల్‌గా ఉన్న ఇండియన్ రెస్టారెంట్ పేరు 'పసంద్'! అని తెల్సుకుని అందులోకి వెళ్లి పాన్‌కేక్ తిన్నాడు. స్వర్గానికి నకలైన అమెరికా మత్తులో పడ్డాడు...

"ఇదేమిటీ ఇది మన ఊతప్పంలా వుంది?" అన్నాడు జీవనను చూసి.

"ఊతప్పంలా ఉండటం కాదు... అది ఊతప్పమే!"

ఆ తరువాత వాసూ, జీవన మిగిలిన మిత్రబృందం కలిసి కింగ్స్ కెన్ యూన్‌తో ఉన్న సియెర్రా మౌంటెన్స్‌కు వెళ్లారు. ఫార్ హొరైజన్ కాంప్‌లో కాలక్షేపం చేశారు. అక్కడే కుటుంబ విషయాలు మాట్లాడుకున్నారు. వాసు తన చెల్లెలు శ్యామల గురించి చెప్పాడు. జీవన తన ఇంటి గురించీ, ఇంట్లోవాళ్ల గురించీ చెప్పింది.

ఆ తరువాత సాయికృప కన్సల్టింగ్స్ గురించీ, దాని ఫ్యూచర్ గురించీ, జీతాల గురించీ మాట్లాడుకుంటున్నారు.




"నేను కాలిఫోర్నియా వెళ్లిపోదామనుకుంటున్నాను!" అంది హఠాత్తుగా జీవన.

"దేనికని?"

"ఈ కన్సల్టింగ్స్ మీద, మీ రామనాథంగారి మీదా ఏవో ఎంక్వయిరీస్ నడుస్తున్నాయని విన్నాను...!"

వాసు నవ్వేశాడు. నమ్మలేదు.

"నువ్వు జాగ్రత్తగా ఉండు. మరో మాట ... నువ్వు డైరెక్ట్‌గా, అంటే స్ట్రెయిట్‌గానే ఇక్కడికి వచ్చావా? అలా వస్తే ఫరవాలేదు. కాకపోతేనే ఇబ్బంది!" అంది అదోలా జీవన.

వాసు ఆశ్చర్యంగా, భయంగా జీవనను చూశాడు.

000

ఓరోజు అమెరికా గవర్నమెంట్ వారి తరఫున ఇమిగ్రేషన్ అండ్ నాచురలైజేషన్ సర్వీసుకు చెందిన వ్యక్తులు వచ్చి రామనాథాన్ని నిలేశారు. అతని సంస్థలో పనిచేసేవాళ్ల జాతకాలూ, సాయికృప పుట్టుపూర్వోత్తరాలు కూపీ లాగారు. రామనాథం ముందు కాస్త బెట్టుగా ఉన్నా, తరువాత మెతకబడటం మొదలుపెట్టాడు. వాళ్లు ప్రోగ్రామర్స్‌కు ఇచ్చే జీతాల వివరాలు అడిగారు. ఇతర వివరాలు రాసుకున్నారు.

వాసు ఆ రాత్రి రామనాథంగారింటికి వెళ్లాడు. అప్పటికే రామనాథంగారు సోఫాలో పడుకుని, ఒంటికి పట్టిన చెమటలు తుడుచుకోలేక తడబడుతున్నాడు. ఆయన పక్కనే వారి సతీమణి జీరోవాల్ట్ బల్బులా కూర్చుని ఉంది. రామనాథానికి కొంచెం దూరంగా కూర్చున్న రామనాథం గారి పార్ట్‌నర్ ఒకాయన తల పైకెత్తి, దించీ బాధగా విన్యాసాలు చేస్తున్నాడు.

"మీరు దొంగచాటుగా ఇంతమందిని ఈ దేశం తేవడం తప్పు. అందులోనూ మరీ మోతాదు మించి మనకు రెండు వందల మంది సాఫ్ట్‌వేర్ గాళ్ళు ఇండియా నుంచి కావల్సి ఉందని ఈ ప్రభుత్వానిని అడిగి నలభై మందిని ఉద్యోగాల్లో పెట్టారు. మిగతా వాళ్ల గురించి మనం ఏమీ చెప్పలేదు. మనది తప్పు. తప్పు కాదు, నేరం... మనం తెచ్చిన వాళ్లలో చాలా మందికి వీసా పొందే అధికారం లేదని ఇమిగ్రేషన్ అండ్ నాచురలైజేషన్ సర్వీసు వాళ్ళు అంటున్నారు... మన మీద కేసుపెట్టారు..."

"అయ్యో ఎలాగండీ" రామనాథం గారి భార్య కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి.

రామనాథం మాట్లాడలేదు. అందరిలాగే వాసూ

దిగులు మొహం వేసుకున్నాడు.

"నేరం ఒప్పుకుని జిల్లా కోర్టులోనూ, మేజిస్ట్రేట్ కోర్టులోనూ తల వంచుకోవడమే!" అన్నాడు రామనాథంగారి పార్టనర్, సానుభూతి ఒలకబోస్తూ.

వాసుకు తల తిరిగింది... ఏం మాట్లాడాలో తెలియక కాసేపు కూర్చుని బయటకు వచ్చి జీవన ఇంటికి వెళ్లాడు. వాసూని చూసిన జీవన ఓదార్చింది.

"ఇండియాలో చేసే మంచి ఉద్యోగం వదులుకుని ఎంతో ఆశతో అమెరికా వచ్చాను. ఇలా జరుగుతుందనుకోలేదు!"

"మనం అత్యాశకు పోయాం, వాసూ! అదే మన తప్పు."

"నువ్వేం చేస్తున్నావు?" తిరిగి అడిగాడు.


"ఇండియా వెడితే బాగుంటుంది. లేకపోతే, ఈ సంస్థతోపాటు మనమూ చేడతాం!" అంది జీవన.

"అలానే... నేను వచ్చేస్తాను. ఈమాత్రం ఏడుపేదో మన ఇండియాలో ఏడ్వొచ్చు!"

000

సీతాపతి ఫోన్‌లో ఎవరితోనో మాట్లాడుతున్నాడు. అటునుంచి ఒక్కొక్క మాటా చెవిన పడుతుంటే ఇటు సీతాపతికి చెమటలు పడుతున్నాయి. బనీను తడిసి ముద్దయింది. కంఠం నీరసవాణి అయింది. ఆయనకు ఎదురుకుర్చీలో కూర్చున్న మాలతి భర్త పడుతున్న అవస్థ చూసి, "ఏమయింది... అదేమిటి, అలా అయిపోతున్నారు?" అంది కంగారుగా.

"వారం క్రితం మన వాసుకు పిల్లనిస్తామని అన్నీ మాట్లాడి వెళ్లారు, చూడు, శేషగిరిరావు..."




"ఏమంటారు?"

"వారికెందుకో మరో ఆలోచన వచ్చిందట. వాసుకు ఒక లక్షకన్నా కట్నం ఇవ్వలేరుట. మనల్ని ఆలోచించుకోమంటున్నారు."

"అదేమిటండీ?"

"వాసుగాడు ఇండియా వాపసు వస్తున్నాడని వాళ్లకు తెలిసిపోయిందిలా ఉంది."

మాలతికి కోపం ఆగింది కాదు. కోపంతోపాటు ఉక్రోషం కూడా వచ్చింది. అందుకే "మన నెత్తిన శనిగాడు ఎక్కి తొక్కుతూంటే అంతే! నే చెప్తే విన్నారా? అత్యాశకు పోయారు. అనుభవించండి!" అనేసింది.

సీతాపతి ఒక్కసారిగా తను వరవిక్రయంలోని పాత్ర అయిన 'సింగరాజు లింగరాజు'కు నకలునని గుర్తుకువచ్చి కుమిలిపోయాడు.

సరిగ్గా అప్పుడే వాకిట్లోకి వచ్చిన శ్యామల, తల్లిదండ్రులు అదోలా ఉండటం చూసింది.

మాలతిగారు కూతుర్నీ చూసి, "నీ మాటేమిటమ్మా, కూతురా... ఆ సుకుమార్ దగ్గరనుంచి ఉత్తరం ఏమన్నా వచ్చిందా? లేకపోతే, అతగాడు కూడా గొడవల్లో పడ్డాడా? అలా ఉన్నావేమిటే... మాట్లాడు!" అని గదిమింది.

"సుకుమారూ లేడు, సింగినాథం లేదు. నేను అతగాణ్ణి పెళ్లి చేసుకోను. నేను కుమార్‌నే చేసుకుంటాను. మీరు వెళ్లి అతనితో మాట్లాడండి. నన్ను ఇంకేం అడొగొద్దు!" అని శ్యామల మరో గదిలోకి అడుగులు వేసింది.

ఆ సమయంలో ఆమె హృదయంలో రేగిన అలజడికి కొండగుర్తుగా ఆమె కళ్లు చెమర్చడం మొదలుపెట్టాయి!! ■

## ఆంధ్రప్రభ పాఠకులకు మాత్రమే ఈ అపూర్వకానుక!

వేదం భారతజాతి జీవననాదం. వందేళ్లుగా మరేభాషలోనూ ఎవరూ చేయని అద్భుతాన్ని డాక్టర్ దాశరథి రంగాచార్య తెలుగులో చేశారు. ఋగ్వేద యజుర్వేద సామవేద అధర్వణవేదాలను చిక్కటి సంస్కృతం నుంచి (9 సంపుటాలు) చక్కటి తెలుగులోనికి అనువదించారు. వేదాలను మనదైన భాషలో హాయిగా చదువుకునే అవకాశం ఇది! ఎమెస్కో ఆర్షభారతి వీటిని రు.2,950/లకు విక్రయిస్తోంది. ఆంధ్రప్రభ పాఠకులకు మాత్రం రు.2000/లకే అందిస్తోంది. ఈ కింది కూపన్ నింపి నగదును డీడీరూపంలో **EMESCO ARSHABHARATHI , VIJAYAWADA** పేరిట తీసి ఎమెస్కో ఆర్షభారతి, ఏలూరురోడ్, విజయవాడ-చిరునామాకు పంపితే చాలు. పోస్టల్ ఛార్జీలు కూడా భరిస్తూ రు.2000/లకే మీకు వేదాలు పంపుతారు. ఈ కూపన్‌ను ఎమెస్కో బుక్‌షాప్‌లో ఇచ్చికూడా వీటిని పొందవచ్చు.

మహత్తరమైన ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని మీ ఇళ్లను మంగళకర వేదపఠనంతో శుభకరం చేసుకోండి!

ఎమెస్కో ఆర్షభారతి-ఆంధ్రప్రభ

పేరు: ------------------------------

వృత్తి: ------------------------------

చిరునామా: ------------------------------

------------------------------

డీడీ నంబరు: ------------------------------